ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 11 ఏప్రిల్ 2024

మే 10న అప్పన్న చందనోత్సవం
- తెల్లవారుజామున 3.30 నుంచి 4.30 వరకు మాత్రమే అంతరాలయ దర్శనాలు
- ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున రాజకీయపరమైన ప్రొటోకాల్ ఉండదు
- రూ.1500, రూ.1000, రూ.300 టికెట్లు అమ్మకం
- కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

.. వివరాలు 1లో

రియల్ ఢమాల్

ఫ్లాట్ల అమ్మకాలూ అంతంత మాత్రమే

- 2023-24 ఆర్థిక సంవత్సరం లక్ష్యంలో 69 శాతమే సాధించిన జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ
- ధరలు అధికంగా ఉండడమే ప్రధాన కారణం
- రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మారడంతో ఎన్నికల ఫలితాలు వచ్చేంత వరకూ వేచిచూసే ధోరణిలో మరికొందరు
- ఏడాదిగా నిలిచిన లావాదేవీలు

కార్యాలయం	లక్ష్యం	సాధించింది
ఆనందపురం	రూ.101.18 కోట్లు	రూ.66.23 కోట్లు
భీమునిపట్నం	రూ.97.69 కోట్లు	రూ.69.86 కోట్లు
ద్వారకానగర్	రూ.162.3 కోట్లు	రూ.116.88 కోట్లు
గాజువాక	రూ.127.13 కోట్లు	రూ.114.84 కోట్లు
గోపాలపట్నం	రూ.84.88 కోట్లు	రూ.56.44 కోట్లు
మధురవాడ	రూ.375.88 కోట్లు	రూ.236.76 కోట్లు
పెందుర్తి	రూ.120.5 కోట్లు	రూ.74.66 కోట్లు
సూపర్‌బజార్	రూ.337.13 కోట్లు	రూ.226.17 కోట్లు
పెదగంట్యాడ	రూ.110.38 కోట్లు	రూ.89.12 కోట్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
విశాఖపట్నం జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైపోయింది. ఇందుకు బిల్డర్ల అత్యాశ, అధిక ధరలు ఒక కారణమైతే, ఎన్నికలు మరొక కారణం. దాంతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల శాఖ ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను సాధించలేకపోయింది. జిల్లాలోని తొమ్మిది రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా రూ.1,5171 కోట్ల ఆదాయం సాధించాలని లక్ష్యం ఇవ్వగా, మార్చి 31తో ముగిసిన ఏడాదికి రూ.1,051 కోట్లు మాత్రమే వచ్చింది. సుమారు రూ.500 కోట్ల ఆదాయ అంతరం ఏర్పడింది. గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇచ్చిన లక్ష్యంలో 90.33 శాతం సాధించి ముందంజలో ఉంది. పెదగంట్యాడ కార్యాలయం 80.73 శాతంతో ద్వితీయ స్థానంలో, ద్వారకా నగర్ కార్యాలయం 72.01 శాతంతో మూడో స్థానంలో నిలిచింది. పెందుర్తి కార్యాలయం 61.96 శాతంతో చివరి స్థానంలోకి వెళ్లిపోయింది.

ఫ్లాట్ల రేట్లు వారిష్టం

విశాఖపట్నం జిల్లాలో భూముల కొనుగోళ్ల ద్వారా లభించే ఆదాయం బాగా తక్కువ. ఆనందపురం, పెందుర్తి ప్రాంతాల్లోనే కొంతవరకు వ్యవసాయ భూములు ఉన్నాయి. అక్కడ ఎకరా ధర కనీసం రూ.10 కోట్ల వరకు ఉండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు తప్ప ఇతరులు ఎవరూ కొనుగోలు చేయలేని పరిస్థితి. ఇక గృహ నిర్మాణం వద్దకు వచ్చే సరికి బిల్డర్లకు క్రెడాయ్ వంటి సంఘాలు ఉండడంతో వారంతా కుమ్మక్కై ఫ్లాట్ల ధరలను ఇష్టానుసారం పెంచుకుంటూ పోతున్నారు. ఏపీలో ఎక్కడా లేనంత ధరలు విశాఖలోనే ఉండడం గమనార్హం. వేలాది ఫ్లాట్లు అమ్ముడుపోకుండా మిగిలిపోతున్నా వారు పట్టించుకోవడం లేదు. ఈరోజు కాకపోతే రేపు అయినా అమ్ముకుంటాం తప్ప ధరలు తగ్గించేది లేదని మొండిగా వ్యవహరిస్తున్నారు. ఐరన్, సిమెంట్, ఇసుక రేట్లతో పాటు కూలీల రేట్లు పెరిగిపోయాయని కారణాలు చెబుతున్నారు. ఐరన్ టన్ను ఇప్పుడు రూ.50 వేలకే లభిస్తున్నా ఆ మేరకు రేట్లు తగ్గించడం లేదు. భూమిని డెవలప్‌మెంట్‌కు తీసుకొని, దానిపై బ్యాంకు రుణం తీసుకొని అపార్టుమెంట్లు నిర్మించేస్తున్నారు. చేతి నుంచి రూపాయి పెట్టకుండా మాటల గారడీ, రాజకీయ పలుకుబడితో నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ రోజు విశాఖపట్నంలో నెలకు రూ.50 వేల జీతం తెచ్చుకునే ఉద్యోగి డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనుక్కునే పరిస్థితి లేకుండా చేశారు. ఇరవయ్యేళ్ల సర్వీసు ఉన్నా ఫ్లాటు కొనడానికి బ్యాంకులు ఇచ్చే రుణం సరిపోక, ఇంకా ఇంట్లో బంగారం అమ్మి లేదా తనఖా పెట్టి అదనపు మొత్తాలు సమకూర్చాల్సి వస్తోంది. పెద్ద పెద్ద నిర్మాణ సంస్థలు విశాఖపట్నంలో చదరపు గజం రూ.8 వేల నుంచి రూ.9 వేలకు విక్రయిస్తుంటే...చిన్న చిన్న భవన నిర్మాతలు కూడా అదే రేట్లు చెబుతున్నారు. నిర్మాణం నాణ్యత, కల్పించే వసతుల విషయం రెండింటికీ చాలా వ్యత్యాసం ఉంటున్నప్పటికీ చిన్న బిల్డర్లు అదే రేట్లు డిమాండ్ చేస్తున్నారు. సెకండ్ హ్యాండ్ ఫ్లాట్ కొనాలని యత్నిస్తే...వాటి రేట్లు కూడా ప్రస్తుత మార్కెట్ ధరలతో పోల్చి, అందులో 80 నుంచి 90 శాతం రేటు ఇవ్వాలని కోరుతున్నారు. ఇలా ఎటుచూసినా ... మిగతా 6వ పేజీలో

స్వయం ఉపాధి శూన్యం



బీసీ, ఎస్సీ, మైనారిటీ యువతకు గతంలో సబ్సిడీపై రుణాలు

- గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సుమారు 30కిపైగా సంక్షేమ పథకాలు అమలు
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వందలాది మందికి లబ్ధి
- ఐదేళ్లలో రెండు శాఖల ఆధ్వర్యంలో సుమారు పది వేల మందికి రూ.300 కోట్ల రుణాలు
- చేతివృత్తిదారులకు 'ఆదరణ' పథకం కింద పరికరాలు పంపిణీ
- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నింటికీ స్వస్తి
- కేవలం బటన్ నొక్కుడుకే పరిమితం
- సంక్షేమ శాఖలు పూర్తిగా నిర్వీర్యం
- ఆ శాఖల ఏర్పాటు ప్రాథమిక లక్ష్యం నెరవేరని వైనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
నిరుపేద యువతీయువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలు ఏర్పాటయ్యాయి. ఏ ప్రభుత్వం వచ్చినా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు, ఆర్థిక సహకారం, వృత్తిదారులకు అవసరమైన పరికరాలు అందిస్తూ వచ్చాయి. ఇందుకోసం ఏటా ఒక్కో సంక్షేమ శాఖ రూ.కోట్లు కేటాయించేవి. కానీ, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా సాయం నిలిపివేసింది. సీఎం జగన్ బటన్ నొక్కుడుకే ప్రాధాన్యం ఇవ్వడంతో ఈ శాఖలకు పనిలేకుండా పోయింది. ఒకప్పుడు ఆయా కులాలకు చెందిన దరఖాస్తుదారులు, లబ్ధిదారులతో కళకళలాడిన సంక్షేమ శాఖలు...గడిచిన ఐదేళ్లుగా వెలవెలబోతున్నాయి.

వందలాది మందికి రుణాలు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వందలాది మందికి రుణాలను అందించారు. ఏటా సుమారు రూ.50 కోట్ల వరకు సబ్సిడీతో కూడిన రుణాలను అందించారు. ఐదేళ్లలో ఈ రెండు శాఖల ఆధ్వర్యంలో సుమారు పది వేల మందికి రూ.300 కోట్ల విలువజేసే రుణాలు మంజూరు చేసినట్టు చెబుతున్నారు. టీడీపీ హయాంలో ఈ శాఖల ఆధ్వర్యంలో సుమారు 30కిపైగా సంక్షేమ పథకాలు అమ లయ్యాయి. స్వయం ఉపాధి పొందే యూనిట్లు ఏర్పాటుకు బీసీ, ఎస్సీ కులాలకు చెందిన యువతకు రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకూ రుణాలుగా మంజూరుచేసింది. ఈ రుణాల్లో 35 నుంచి 60 శాతం వరకూ సబ్సిడీ ఉండేది. బ్యాంకులు ముందుకురాకపోతే ఎన్ఎస్ఎఫ్‌డీఎస్ సహకారంతో ప్రభుత్వమే రుణాలు ఇచ్చే ఏర్పాట్లుచేసింది. ఈ రుణాలతో నిరుద్యోగ యువత ఉపాధి పొందేందుకు పౌల్ట్రీ, డెయిరీ, మిల్లులు, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేవారు. వీటి ద్వారా వాళ్లు ఉపాధి పొందడంతోపాటు మరింతమందికి ఉపాధిని కల్పించేవాళ్లు. వాటన్నింటికీ వైసీపీ ప్రభుత్వం మంగళం పాడేసింది.

ఎన్నో పథకాలు అమలు

బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అమలుచేసిన పథకాలతో వందలాది మంది లబ్ధి పొందేవారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక్కో సంక్షేమ శాఖకు కనీసం రూ.25 కోట్ల రూపాయలు కేటాయించేది. ఆదరణ, సబ్సిడీ రుణాలు, విదేశీ విద్య, పెళ్లి కానుకలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ, బీసీ భవనాల నిర్మాణం, సబ్సిడీపై వాహనాల పంపిణీ, చంద్రన్న కానుకలు ... మిగతా 6వ పేజీలో

కుల వృత్తిదారులకు సహకారం ఏదీ



బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని అనేక కులాలకు చెందిన కార్పొరేషన్లకు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో భారీగా నిధులు అందేవి. సబ్సిడీతో కూడిన రుణాలు, ఆదరణ పథకంలో భాగంగా ఉపకరణాలు అందేవి. ఏటా రజక కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు వచ్చేవి. రజకులకు ఇస్త్రీ పెట్టెలు, ఇస్త్రీ చేసుకునేందుకు బండ్లు వంటివి అందించాం. ఇంకా పరికరాలు కొనుగోలు చేసి ఉన్నా...ఈ ప్రభుత్వం పంపిణీ చేయలేదు. అలాగే దోబీఘాట్ల నిర్మాణానికి ఇవ్వాల్సిన నిధులను కూడా ఈ ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించింది. గడిచిన ఐదేళ్లలో కుల వృత్తులు చేసుకునే వారికి కనీస సహకారాన్ని కూడా ఈ ప్రభుత్వం అందించలేదు.
- రాజమండ్రి నారాయణ, రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్

రోజుకో పది కేసులు ఇవ్వండి

మద్యం దుకాణాలకు వైసీపీ నేతల హుకుం

- సిబ్బందిపై ఒత్తిడి

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో పంచేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు మద్యం నిల్వ చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తమ మనుషులను మద్యం దుకాణాలకు పంపించి రెండు, మూడు సీసాలను తెప్పిస్తున్నారు. వాటిని ఒకచోట నిల్వ చేసుకుంటున్నారు. కానీ వైసీపీ నేతలు మాత్రం తమ అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఒకేసారి పదుల సంఖ్యలో మద్యం కేసులను కొనుగోలు చేసేందుకు యత్నిస్తున్నారు. అందులో భాగంగా తమ నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాల వద్దకు అనుచరులను పంపుతున్నారు. రోజుకో పది కేసులను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలా ఇవ్వడం కుదరదని, ఒక్కొక్కరికి రెండు లేదా మూడు సీసాల కంటే ఎక్కువ ఇవ్వొద్దని ఆదేశాలు ఉన్నాయని సిబ్బంది చెబితే...'ఇదే విషయాన్ని మా నాయకుడి దృష్టికి తీసుకువెళితే...మీరంతా ఇబ్బందులు పడాల్సి వస్తుంది' అంటూ సదరు అనుచరులు బెదిరిస్తున్నారు. అయినప్పటికీ అధికారుల ఆదేశాలను కాదని ఒకరికే బల్క్‌గా సరకు ఇస్తే తాము కేసులు ఎదుర్కొనాల్సి వస్తుంది కాబట్టి మీరేం చేసినా తాము మాత్రం ఏమీ చేయలేమని సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. నగరంలో దాదాపు అన్ని మద్యం దుకాణాల సిబ్బందికి ఇదే పరిస్థితి ఎదురవుతున్నట్టు ఎక్సైజ్ అధికారులే చెబుతున్నారు. మద్యం దుకాణాల సిబ్బంది ససేమిరా అంటుండడంతో డిపోల నుంచే నేరుగా సరకు తెప్పించుకుంటామంటూ వైసీపీ చోటా నేతలు వెనుతిరుగుతున్నట్టు సిబ్బంది చెబుతున్నారు.

పలు రైళ్లు రద్దు... రీ షెడ్యూల్...దారి మళ్లింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 10:



సంబల్‌పూర్ డివిజన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు, రీ షెడ్యూల్ చేశామని, మరికొన్నింటిని మళ్లింపు మార్గంలో నడపనున్నట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

రద్దయిన రైళ్లు: ఈనెల 15 నుంచి 24 వరకు విశాఖ-రాయపూర్ పాసింజర్ (08527), రాయపూర్-విశాఖపట్నం పాసింజర్ (08528), విశాఖ-భవానీపట్న పాసింజర్ (08504), సంబల్‌పూర్-రాయగడ ఎక్స్‌ప్రెస్ 18301), రాయగడ-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18302), ఈనెల 16 నుంచి 25 వరకు భవానీపట్న-విశాఖ పాసింజర్ (08505) రద్దు.

రీ షెడ్యూల్: విశాఖ-భగత్ కి కోఠి ఎక్స్‌ప్రెస్ (18573) ఈనెల 18న నిర్ణీత సమయం కంటే 2.30 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.

దారి మళ్లింపు: విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్ (18311) ఈనెల 21న వయా విజయనగరం, కుర్దారోడ్డు, సంబల్‌పూర్ సిటీ, జార్సుగూడ మీదుగా, తిరుగు ప్రయాణంలో బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18312) ఈనెల 22న వయా జార్సుగూడ, సంబల్‌పూర్ సిటీ, అంగుల్, విజయనగరం మీదుగా నడుస్తాయి. అలాగే ఈనెల 15, 24 తేదీల్లో టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) వయా జరోలి, కటక్, కుర్దారోడ్డు, విజయనగరం మీదుగా...తిరుగు ప్రయాణంలో ఎర్నాకులం-టాటా ఎక్స్‌ప్రెస్ (18190) ఈనెల 14, 23 తేదీల్లో వయా విజయనగరం, కటక్, జరోలి మీదుగా నడుస్తాయి.

నేటి నుంచి 28 వరకు రాజమండ్రి పాసింజర్ రద్దు

దక్షిణ మధ్య రైల్వేలో రోలింగ్ స్టాక్ కారిడార్ కార్యక్రమం చేపడుతున్న నేపథ్యంలో రాజమండ్రి-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే 07466, 07467 నంబర్లు గల పాసింజర్ రైళ్లను ఈనెల 11 నుంచి 28 వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి పేర్కొన్నారు.

నేడు రంజాన్



రంజాన్ పర్వదినాన్ని గురువారం జరుపుకోనున్న నేపథ్యంలో జిల్లాలోని మసీదులు విద్యుద్దీపాలంకరణలతో కొత్త శోభను సంతరించుకున్నాయి. నగరంలోని చినవాల్తేరులో ఓ మసీదు ఇలా విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది.

ఎండీయూ ఆపరేటర్లకు వైసీపీ నేతల గాలం?

వార్డుల వారీగా రహస్య సమావేశాలు



- తాయిలాలు పంపిణీ
- తమ పార్టీకి అనుకూలంగా పనిచేయాలంటూ ఆదేశం
- ఇప్పటికే ఆ దిశగా కొంతమంది ఆపరేటర్లు
- ఓటర్లను ప్రభావితం చేసేందుకు యత్నం

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):
రానున్న ఎన్నికల్లో తమకు అనుకూలంగా వ్యవహరించాలంటూ బియ్యం కార్డుదారులకు సరకులు పంపిణీ చేసే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లపై వైసీపీ నేతలు ఒత్తిడి తీసుకువస్తున్నారు. నగరంలో వార్డుల వారీగా ఎండీయూ ఆపరేటర్లతో రహస్య మంతనాలు జరుపుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రేషన్ డీలర్లకు ప్రత్యామ్నాయంగా ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థను తీసుకువచ్చింది.

విశాఖ జిల్లాలో 640 రేషన్ డిపోల పరిధిలో 325 వరకు ఎండీయూ వాహనాలు ఉన్నాయి. సుమారు 5.23 లక్షల రేషన్ కార్డులు వీరి పరిధిలోకి వస్తాయి. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 18వ వరకు వీధుల్లో తిరిగి బియ్యం, పంచదార, ఇతర సరకులు చేస్తుంటారు. దీంతో కార్డుదారులకు ఎండీయూలకు సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రతి కార్డుదారుడిని పేరు పెట్టి పిలిచే పరిచయం ఉండడంతో వారిని ప్రభావితం చేసేందుకు వైసీపీ నేతలు యత్నిస్తున్నారు. వలంటీర్లపై ఎన్నికల సంఘం ఆంక్షలు విధించడంతో వారికి ప్రత్యామ్నాయంగా ఎండీయూ ఆపరేటర్లతో ఓటర్లను తమకు అనుకూలంగా మలచుకోవాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎండీయూ ఆపరేటర్లతో వార్డుల వారీగా సమావేశాలు ఏర్పాటుచేసి తాయిలాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా నగరంలో కొన్నిచోట్ల ఎండీయూ ఆపరేటర్లకు ఉగాది కానుకలు అందించారని చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రభుత్వ ఖాతా (సీఎంఎఫ్ఎస్) నుంచి జీతం/గౌరవ వేతనం/కమీషన్ ... మిగతా 6వ పేజీలో

భీమిలి బీచ్‌రోడ్డులో ప్రమాదం

తొట్లకొండ వద్ద ద్విచక్ర వాహనాలు ఢీ

- ఇద్దరి మృతి
- మరో ఇద్దరికి గాయాలు

భీమునిపట్నం, ఏప్రిల్ 10:



తొట్లకొండ వద్ద ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

భీమిలి బీచ్‌రోడ్డులో తొట్లకొండ వద్ద మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. ఇందుకు సంబంధించి భీమిలి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రుషికొండ ప్రాంతానికి చెందిన దౌలపల్లి చినఅప్పలరాజు (25) ఏ1 గ్రాండ్ బేలో పార్టుటైమ్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అతను మంగళవారం రాత్రి పన్నెండు గంటలు దాటిన తరువాత స్నేహితుడి వాహనం ఆగిపోయిందని స్కూటీ (ఏపీ 39 ఎస్‌ఎ 3781)పై భీమిలి వైపు బయలుదేరాడు. అదే సమయంలో భీమిలి వైపు నుంచి సుజుకీ యాక్సస్‌పై ముగ్గురు అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చినఅప్పలరాజును వెంటనే కేజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. అలాగే, సుజుకీ వాహనం నడుపుతున్న చింతపల్లి వీరభద్ర గౌతమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. ఇదేవాహనంపై వెనుక కూర్చున్న దుర్గ, రాజులు కూడా తీవ్రంగా గాయపడి అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరభద్ర, దుర్గ, రాజులు కూడా రుషికొండ ప్రాంతానికి చెందినవారుగా ... మిగతా 6వ పేజీలో

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు అందని జీతాలు

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 2,000 మంది వరకూ విధులు
- తక్షణం వేతనాలు చెల్లించాలని డిమాండ్

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న సుమారు రెండు వేల మంది ఉద్యోగులకు జీతాలు ఇంకా అందలేదు. ఒకటి, రెండు తేదీల్లో రావాల్సిన వేతనాలు పదో తేదీ వచ్చినా ఇవ్వలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్స్, బోధనాస్పత్రుల్లో స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టు, ఏఎన్ఎం, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ హోదాల్లో సుమారు రెండు వేల మంది చేస్తున్నారు. వీరికి నెలకు రూ.18 వేలు నుంచి రూ.35 వేల వరకూ వేతనంగా ఇస్తున్నారు. అయితే ఈ నెల పదో తేదీ వచ్చినా జీతాలు అందలేదని, ఉన్నతాధికారులను అడుగుతున్నా స్పందించడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నేషనల్ హెల్త్ మిషన్ నుంచి నిధులు సకాలంలోనే వస్తుంటాయని, అయినా తమకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని సిబ్బంది వాపోతున్నారు. ఇదిలావుంటే మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని గడిచిన మూడేళ్లుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదం టున్నారు.

పారిశుధ్యం ఇలా ఉంటే.. వ్యాధులు రావా?

▸▸ అధ్వానంగా దొండపర్తి పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10: గ్రేటర్ 27వ వార్డు దొండపర్తి పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. వీటినుంచి మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తుండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. డ్రైనేజీలోని మురుగు తొలగించడంలో పారిశుధ్య కార్మికులు నిర్లక్ష్యం వహిస్తుండడంతోనే ఈ దుస్థితి నెలకొంటోంది. నెహ్రూ బజారు సమీపాన, గ్రంథాలయం పరిసర ప్రాంతాల్లోని డ్రైనేజీల్లో మురుగు, చెత్త పేరుకుపోతోంది. ఈ వార్డుకు కొన్ని నెలల పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో సచివాలయ శానిటేషన్ కార్యదర్శి ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత కొద్ది రోజుల తర్వాత పూర్తిస్థాయి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు. అయినా, పారిశుధ్య పనులు మెరుగుపడలేదు. వార్డులో పలు డ్రైనేజీలు మురుగుతో నిండిపోతుండడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే వీలుంది. పారిశుధ్య కార్మికులు పట్టించుకోకపోవడంతో దుర్వాసనన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి డ్రైనేజీల్లోని మురుగు తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ప్రాంతీయ గ్రంథాలయం సమీపంలో మురుగునీరు

సమాజం భాష, సంస్కృతి పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట, ఏప్రిల్ 10: సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్షులు శేఖర మంత్రి ప్రభాకర్ అధ్యక్షతన ఆచార్య వెలమల సిమ్మన రాసిన సమాజంభాష, సంస్కృతి పుస్తకావిష్కరణ బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిజం విద్యా సంస్థల అధినేత ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య సిమ్మన్న సేవలు తెలుగు సాహిత్యానికి వెల కట్టలేమన్నారు. ఈ పుస్తకాన్ని రచయిత ఆచార్య వెలమల సిమ్మన్న శేఖర మంత్రి ప్రభాకర్‌కి అంకితం చేశారు. పుస్తక రచయిత ఆచార్య సిమ్మన్న మాట్లాడుతూ తన గ్రంథాలు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని విద్యార్థులకు, భాషాభిమానులకు, ఆచార్యులకు అందరికి ఉపయోగపడడం చాలా ఆనందం కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డీవీ సూర్యారావు, డాక్టర్ కేజీ వేణు, సీహెచ్ సూర్యానారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు


రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థినులు

మద్రిపాలెం, ఏప్రిల్ 10: రవీంద్ర భారతి స్కూల్లో బుధవారం రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఒకరి కొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. విద్యార్థుల్లో సమ భావం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వెంకటేష్ పాల్గొన్నారు.

సీతంపేట: ద్వారకానగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో కిడ్స్ కాన్వొకేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ నవ్యశ్రీ చిన్నారి విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు వారిని సన్మానించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాయి సౌందర్య, జెడ్ఐ వెంకటేష్, సీజీఎం వసంత, డీన్ సుదలత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గండిబాబ్జీ


అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10: టీడీపీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జి సమక్షంలో వైసీపీ నుంచి యువకులు బుధవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బాబ్జి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో గతంలో టీడీపీ కార్యకర్తలను స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ టిడ్కో ఇళ్లు ఇస్తామని మభ్యపెట్టి వైసీపీలో వీరిని చేర్పించారు. వీరంతా మళ్లీ వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇచ్చేది తమపార్టీయేనని అన్నారు. వైసీపీ ఎన్నో ప్రలోభాలకు గురి చేస్తోందని చెప్పారు. టీడీపీ కార్యకర్తలు వైసీపీ ఉచ్చులో పడొద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు: సీపీ


నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్‌తో ఏపీ ఛాంబర్స్ బృంద సభ్యులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 10: ఏపీ ఛాంబర్స్ బృందం బుధవారం నగర పోలీస్ కమిషనర్ డా.ఎ.రవిశంకర్‌తో సమావేశమయ్యారు. సీపీ నూతనంగా ఫోకస్డ్ స్ట్రెచ్ మేనేజ్‌మెంట్‌పై చర్చించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ట్రాఫిక్ వాలంటీర్లతో 24/7 365 రోజులు ఈ స్ట్రెచ్‌లను బలోపేతం చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చునన్నారు. విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం ఉన్నందున ఏపీ ఛాంబర్స్ ఈ కొత్త కార్యక్రమానికి మద్దతు ఇవ్వడానికి అంగీకరించింది. ఈ సమావేశంలో ఛైర్మన్ శ్రీచిట్టూరి శ్రీనాథ్, వైస్ ఛైర్మన్ పి.శోభన్‌ప్రకాష్, వైస్ ఛైర్‌పర్సన్ ఎ.లీలారాణి, డా.జి.సాంబశివరావు, ఈసీ మెంబర్ సుధీర్ ములగాడ, ఏపీసీ ట్రాఫిక్ రాజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

14న చంద్రబాబు అనకాపల్లి జిల్లా పర్యటన



అనకాపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 14న అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటలకు పాయక రావు పేటలో జరిగే ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు చోడవరంలో జరిగే ఎన్ని కల ప్రచార సభలో కూడా పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బుద్ద పిలుపునిచ్చారు.

31వ వార్డు వైసీపీ నేత రాజీనామా

- చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిక


నవీన్‌కుమార్‌కు పార్టీ కండువావేసి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 10: దశాబ్ద కాలంపైగా వైసీపీలోనున్న గ్రేటర్ విశాఖ 31 వ వార్డుకు చెందిన బత్తిన నవీన్‌కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఆయన ఆ పార్టీలో చేరారు. బుధవారం సీతారాజు సుధాకర్ ఆధ్వర్యంలో వార్డు నుంచి ఆయనతో పాటు పలువురు కార్యకర్తలు వెళ్లి టీడీపీలో చేశారు. కాగా, 31వ వార్డు వైసీపీ పార్టీ తరపున గతంలో కార్పొరేటర్ అభ్యర్థిగా బత్తిన నవీన్‌కుమార్ పోటీ చేశారు. వార్డులోని వైసీపీని వీడడంతో ఆ పార్టీకి షాక్ తగిలినట్టని రాజకీయ పరిశీలకు అంటున్నారు.

గ్రూప్-2 ఎంపికలో మార్పుపై హర్షం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10: గ్రూప్-2 ప్రశ్నాపత్రం పెద్దపెద్ద ప్రశ్నలతో తక్కువ సమయం కేటాయించడంతో చాలామంది అభ్యర్థులు అర్హత కోల్పోతారని ఏపీపీఎస్సీ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ తెలిపారు. ఈ అభ్యర్థనను అర్థం చేసుకుని ఎంపిక విధానంలో మార్పుచేసినట్టు చెప్పారు. గ్రూప్-2 ప్రధాన పరీక్ష జూలై చివరిలోనైనా, ఆగస్టులో గానీ పెట్టాలని కోరారు.

రియల్ ధమాల్

... 5వ పేజీ తరువాయి

భారం కావడంతో ఆర్థికంగా స్థోమత కలిగినవారు తప్ప మధ్య తరగతి ప్రజలు ప్లాట్లు, ఇళ్ల కొనలేకపోతున్నారు. దాంతో రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం పడిపోయింది.

ఏడాదిగా నిలిచిన పెట్టుబడులు

వైసీపీ అధికారంలోకి వచ్చాక అమరావతి రాజధాని కాదని, అక్కడ అభివృద్ధి పనులు ఆపేసింది. విశాఖపట్నం పరిపాలనా రాజధాని అంటూ ఇక్కడ ఆ పార్టీ నాయకులు స్థిరాస్తులు సమకూర్చుకున్నారు. ఆ మాటలు నిజమవుతాయని కొందరు చేతిలో ఉన్న డబ్బులు ఇక్కడ పెట్టుబడులు పెట్టారు. రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మారడం, ఎన్నికలు కూడా రావడంతో కొత్తగా పెట్టుబడులు పెట్టేవారు ఏడాదికాలంగా ఆగిపోయారు. ఎన్నికల తరువాత పరిస్థితిని బట్టి చూసుకోవచ్చునని వేచి ఉన్నారు. వీటన్నింటి నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయింది.

స్వయం ఉపాధి శూన్యం

... 5వ పేజీ తరువాయి

మత్స్యకారులకు చెరువులు కేటాయింపు, బోట్ల ఆధునికీకరణ, వృత్తుల వారీగా అవసరమైన పరికరాలు పంపిణీ, మహిళా పారిశ్రామిక వేత్తలకు రాయితీలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సహాయం, నేతన్నలకు పావలా వడ్డీకి రుణాలు, కొత్త మగ్గాలు కొనుగోలుకు సబ్సిడీలు, మల్బరీ తోటల పెంపకానికి ప్రోత్సాహం, గీత కార్మికుల సొసైటీలకు ఆర్థిక సాయం, ఈత, తాటిచెట్ల పెంపకానికి ప్రోత్సాహం, గొర్రెలు, మేకలు పెంపకానికి ప్రోత్సా హంతోపాటు ఆయా కులాలు ఆర్థికంగా, సామా జికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన సహకారాన్ని కార్పొరేషన్లు అందించేవి. ఆదరణ పేరుతో వివిధ వృత్తులు చేసుకునే వారికి అవసరమైన పరికరాలను పెద్దఎత్తున పంపిణీ చేశారు. రజకులకు ఇస్త్రీ పెట్టెలు, లాండ్రీ మిషన్లు, దోబీ ఖానాలు అభివృద్ధికి అవసరమైన నిధులు, నాయీ బ్రాహ్మణులకు అవసరమైన పరికరాలు, కమ్మరి, కుమ్మరి, మత్స్య కారులకు అవసరమైన పరికరాలను ఉచితంగా అందించి వారి వృత్తుల్లో మరింత మెరుగైన పనితీరు కనబరిచేలా చేసి మరింత ఆదాయాన్ని పొందేందుకు ప్రభుత్వం సహకారాన్ని అందించింది. టీడీపీ ప్రభుత్వం చివరి రెండేళ్లలో బీసీ, ఎస్సీ యువతకు ఆటోలు, వ్యాన్లు ట్రాక్టర్లు, కార్లు వంటి వాహ నాలను అందించింది. వీటి ద్వారా సుమారు 300 మంది వరకూ ఉపాధి పొందారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వెట్టి, జోగినులకు పునరావాస కార్యక్రమాలు, పేదల రైతుల పొలాల్లో బోర్లు, పంపుసెట్లు, విద్యుత్ సౌకర్యం, భూమి అభివృద్ధి, భూమి లేని పేదలకు భూములు కొనుగోలు చేసి అందించడం, వడ్డీ లేని రుణాలు ఇవ్వడం వంటి వాటిని అమలు చేశారు. జగన్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించి ఛైర్మన్లను మాత్రమే నియమించింది. ఈ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి పథకాలను అమలు చేయలేదు. ఒక్క పైసా కూడా ఇవ్వలేదు.

ఉపాధికి అవకాశం ఏదీ..?

గత తెలుగుదేశం పార్టీ హయాంలో లక్షల రూపాయలు రుణాలుగా అందించడం ద్వారా యువత స్వయం ఉపాధి పొందేందుకు అనుగుణమైన యూనిట్లు ఏర్పాటుచేసుకునే వారు. కానీ, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా పథకాలను పూర్తిగా నిలిపివేసింది. జగనన్న చేదోడు కింద పది వేలు, కాపు నేస్తం కింద రూ.15 వేలు, ఈబీసీ నేస్తం కింద రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని మాత్రమే వైసీపీ చేస్తోంది. ఈ మొత్తాలతో ఉపాధి పొందడం ఎలా సాధ్యమవుతుందని ఆయా కులాలకు చెందినవారే ప్రశ్నిస్తున్నారు. యువత ఉపాధి పొందేందుకు అనుగుణంగా నిధులను అందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన తరువాత పెళ్లి కానుక, రంజాన్ తోఫా వంటి పథకాలను పూర్తిగా ఆపేసిన వైసీపీ ప్రభుత్వం.. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో గత ఏడాది నుంచి విదేశీ విద్య, పెళ్లి కానుకను అమలు చేస్తోంది.

భీమిలి బీచ్‌రోడ్డులో ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. కాగా, ఈ విషయమై, రుషికొండ ఎంఆర్ బాయ్స్ హాస్టల్ వద్ద నివాసం ఉంటున్న చినఅప్పలరాజు సోదరుడు, సీసీ టీవీ టెక్నీషియన్ అప్పలరాజు తమకు ఫిర్యాదు చేశారన్నారు. తన తమ్ముడైన చినఅప్పలరాజు తన స్నేహితుడు వాహనం ఆగిపోయిందని చెప్పి స్కూటీని అర్ధరాత్రి 12.25 గంటలకు తీసుకువెళ్లాడని, తర్వాత 12.50 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ప్రమాదం జరిగిందని, కేజీహెచ్‌కు తీసుకువెళుతున్నామని తెలిపాడని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. పూర్తి వివరాలు అందవలసి ఉందన్నారు. కాగా, భీమిలిలో అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్నాయి. పండగకు వచ్చి వెళుతున్న వాహనం ఒకటి, పండగకు వస్తున్న వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. చేపల తిమ్మాపురం వద్ద వంతెన మరమ్మతులు జరుగుతున్నందున ఒకవైపు రహదారిని మూసివేసి, తొట్లకొండ వరకూ రహదారిని వన్‌వేగా మార్పు చేయడంతో ఆ ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో పోలీసు అధికారులు మరిన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎండీయూ ఆపరేటర్లకు వైసీపీ నేతల గేలం?

... 5వ పేజీ తరువాయి

తీసుకున్న వ్యక్తులెవరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదు. దీనిని పరిగణనలోకి తీసుకుని అధికార పార్టీ నేతలు అన్ని జాగ్రత్తలు తీసుకుని ఎండీయూ ఆపరేటర్లతో రహస్యంగా సమావేశమై తమ అభ్యర్థుల తరపున ప్రచారం చేయాలని కోరుతున్నారు. ఇందుకు అధికార పార్టీ కార్పొరేటర్లు/బియ్యం వ్యాపారులను రంగంలోకి దింపారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించాలని సూచించారు. ఈనెలలో బియ్యం పంపిణీ చేసినప్పుడే కొందరు ఎండీయూ ఆపరేటర్లు కొందరు ఓటర్లను ప్రభావితం చేసేందుకు యత్నించారు. ఇదిలావుండగా నగరంలో రేషన్ డీలర్ల సంఘ నేతలు, కొందరు డీలర్లు కలిసి నాలుగైదు రోజుల క్రితం బీచ్‌రోడ్డులో ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ మంత్రి వద్దకు వెళ్లారు. తమ సమస్యలు పరిష్కరిస్తే మద్దతు ఇస్తామని చెప్పారు.

బార్‌ల యజమానుల నుంచి వైసీపీ నాయకులకు మామూళ్లు

▸▸ జనసేన, టీడీపీ నేతలు ఆరోపణ

సీతంపేట, ఏప్రిల్ 10: విశాఖ జిల్లాలోని మద్యం బార్‌లనుంచి నెలకు రూ. 6 కోట్ల మేర లంచాలు వసూలు కాగా, ఇందులో రూ. 3 కోట్లు అధికార పార్టీ పెద్దలకు చేరుతున్నట్టు జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. విడతల వారి సంపూర్ణ మద్య నిషేదం హామీతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఢిల్లీలో ప్రభుత్వాన్ని మించిన మద్యం స్కామ్ చేస్తోందని ఆయన విమర్శించారు. స్థానిక బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రాలో తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా జరుగుతున్న స్కామ్ విలువ రూ. 50 వేల కోట్లకు పైనే అని అన్నారు. ఏటా రాష్ట్రంలో రూ. 30వేల కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, ఇందులో రూ. 10 వేల కోట్ల వరకూ లంచాల రూపంలో ప్రభుత్వ పెద్దలు, అధికారులకు చేరుతోందన్నారు. విడిపోయిన విశాఖ జిల్లాలోనే రూ. 130 వరకూ బార్‌లు ఉన్నాయని, వీటి నుంచి నెలకు రూ. 5 లక్షల చొప్పున రూ.7.50 కోట్ల లంచాన్ని ఎక్సైజ్ ఉన్నతాధికారి ఆధ్వర్యంలో వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో రూ. 3 కోట్లు ఉత్తరాంధ్ర వ్యవహారాలు చూసే పార్టీ పెద్దలకు చెల్లిస్తున్నారన్నారు. గతంలో నాలుగేళ్లపాటు ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్‌చార్జి విజయసాయిరెడ్డి ఆశీస్సులతో శ్రీనివాస్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేయగా, ప్రస్తుతం సీఎం పేషీ ముఖ్య అధికారి ధనుంజయరెడ్డి శిష్యుడిగా చెలామణి అవుతున్న సుధీర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వ వైన్‌షాపుల్లో జనాలు కోరుకొనే మద్యం లేకుండా చేయ డం, రాత్రి ఎనిమిది గంటలకే దుకాణాలు మూసివేసి బార్‌లకు లబ్ధి చేకూర్చేందుకు నిబంధనలు పెడుతున్నారన్నారు. వీటితో పాటు బార్‌లలో జరిగే ఉల్లంఘనలపై కేసులు లేకుండా చేయడం, అదనపు సమయాలకు అనుమతిచ్చి వారినుంచి లంచాలు గుంజుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

ఎన్నికల నిబంధనలు అనుసరించాలి


మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

జ్ఞానాపురం, ఏప్రిల్ 10: ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో పెట్టే సమయంలో అన్ని రాజకీయ పార్టీలు హాజరు కావాలని పశ్చిమ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారంజ్ఞానాపురంలోని పశ్చిమ నియోజకవర్గం ఆర్వో కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పక్షాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 19న షెడ్యూల్ విడుదల అనంతరం రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను వివరించారు.

భవిత కేంద్రానికి ఎస్సీ, ఎస్టీ సంఘం విరాళం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10: ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీ ఎంసీ ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు పి.ఆదినారాయణ రూ.2వేలు నగదు విరాళం అందజేశారు. హెచ్ఎం బి.లక్ష్మీ నరస, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శారద, జగదాంబకు ఆ నగదును అందించారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రొడక్షన్ మేనేజర్ చెంగల సునీల్, సంఘం సభ్యులు చెంగల చిన్నారావు, శ్రీను పాల్గొన్నారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో భానుప్రకాశ్‌కు స్వర్ణాలు


పతకం అందుకుంటున్న భానుప్రకాశ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 10: ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో నగరానికి చెందిన పుష్పాల భానుప్రకాశ్ మూడు స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నా డు. నేపాల్‌లో జరిన ఈ మీట్‌లో 45 ప్లస్ పురుషుల విభాగంలో 100మీ, 200మీ., 400మీ. పరు గులో బంగారు పతకాలు సొం తం చేసుకుని సత్తా చాటాడు. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ టోర్నీ లో మూడు స్వర్ణ పతకాలు సాధించి దేశానికి ఖ్యాతి తెచ్చిన భానుప్రకాశ్‌ను పలువురు మాస్టర్ అథ్లెట్లు అభినందించారు.

తాగునీటి పైపులైన్ పనులు


పైప్‌లైన్ కోసం తవ్వకాలు

మాధవధార, ఏప్రిల్ 10 ; గ్రేటర్ 50వ వార్డు మాధవధార రోడ్డులో చేపడుతున్న తాగునీటి పైపులైను పనులు చేపడుతున్నారు. ఎగువ మాధవధార కొండకు చేరే దారి నుంచి దిగువ 48ఏ బస్టాపు వరకు మెయిన్ లైన్‌కు అనుసంధానిస్తూ ఈ పనులు చేపడుతున్నారు. వేసవిలో తాగునీటి అవసరాల్ని దృష్ట్యా కాంట్రాక్టు ప్రాతిపదికన కొత్తపైపులైను వేస్తున్నారు. దీంతో మాన్యం, మాధవధార శంకర్‌నగర్, పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా సక్రమంగా మెరుగవనుంది.

3, 4 ప్లాట్‌ఫారాలపై రైళ్ల పునరుద్ధరణ

▸▸ కొనసాగుతున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో 3, 4 ప్లాట్‌ఫారాలపై రైళ్ల రాకపోకలను బుధవారం పునరుద్ధరించారు. రెండు రోజుల క్రితం దక్షిణం వైపుగల మూడో గేటు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి కుంగిపోయిన సంగతి తెలిసిందే. అది సరిగ్గా 3, 4 ప్లాట్‌ఫారాలపై ఉండడంతో వాటిపైకి రైళ్ల రాకపోకలు నిలిపేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ నేతృత్వంలో చీఫ్ బ్రిడ్జి ఇంజనీర్ రాజ్‌కుమార్, చీఫ్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, తదితరులు దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. అయితే ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు ఇంకా కొనసాగుతున్నందున, వాటిని క్షుణ్ణంగా పరిశీలించాకే ప్రయాణికులను దానిపైకి అనుమతిస్తామని, అంతవరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.


ఫుట్ ఓవర్ బ్రిడ్జిని అమరుస్తున్న దృశ్యం

రోడ్డంతా దుమ్ము, ధూళిమయం



కంకర రాళ్లు తేలి మట్టిమయంగా ఉన్న పెందుర్తి రైల్వేస్టేషన్ రోడ్డు

దీనికితోడు ఎక్కడికక్కడ గోతులు
తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహన చోదకులు, పాదచారులు
అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

పెందుర్తి, ఏప్రిల్ 10: పెందుర్తి రైల్వే స్టేషన్ రోడ్డు దుమ్ము, ధూళితో నిండిపోవడంతో పాటు ఎక్కడికక్కడ గోతులమయంగా మారడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే అధ్వానంగా ఉన్న ఈ రోడ్డులో దుమ్ము, ధూళి ఎగసిపడుతుండడంతో రాకపోకలు సాగించడం నరకాన్ని తలపిస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము, ధూళి వల్ల ముక్కు మూసుకుంటూ ఈ మార్గంలో రాకపోకలు సాగించాల్సి వస్తుందని పలువురు పాదచారులు పేర్కొంటున్నారు.

పెందుర్తి పోలీస్ స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్ మార్గం వరకు సుమారు రెండు కిలోమీటర్లు రూ1.54 కోట్లతో తారురోడ్డు నిర్మించేందుకు ఫిబ్రవరి నెలలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. అయితే వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల మాత్రం ఎందువల్లో అధికారులు ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు హడావిడిగా పనులు మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఫ్లై యాష్‌ను తెప్పించి రోడ్డంతా వేశారు. మూడు రోజుల క్రితం ఫ్లై యాష్, కంకర పిక్క వేసి అలానే వదిలేశారు. కనీసం ఫ్లై యాష్‌ను నీటితో తడపడం కూడా చేయలేదు. దీంతో రోడ్డుపై వేసిన కంకర రాళ్లు, దుమ్ము, ధూళితో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారంతా నానాపాట్లు పడుతున్నారు. మట్టి పడడం వల్ల కళ్లు ఎర్రగా మారి ఇబ్బంది పడుతున్నామని పలువురు వాహనదారులు వాపోతున్నారు.

మట్టి, కంకర రాళ్ల వల్ల ద్విచక్ర వాహనాలు స్కిడ్ అయి ప్రమాదాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. ఫ్లై యాష్ ఇళ్లలోకి ప్రవేశిస్తుండడంతో కళ్ల మంటలు, శ్వాసకోస సమస్యలు తలెత్తుతున్నాయని పరిసర ప్రాంతాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఫ్లై యాష్, కంకర వేశాక కనీసం వాటరింగ్ పనులు కూడా చేపట్టకపోవడం దారుణమని స్థానికులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు త్వరితంగా పూర్తయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఆస్తి పన్ను చెల్లించేందుకు బారులుతీరుతున్న ప్రజలు

ఐదు శాతం రాయితీకి అనూహ్య స్పందన



పన్నులు చెల్లించేందుకు సౌకర్యం కేంద్రం వద్ద బారులుతీరిన ప్రజలు

గాజువాక, ఏప్రిల్ 10: ఏడాది మొత్తానికి సంబంధించిన ఆస్తి పన్నును ఒకేసారి చెల్లించిన వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ప్రకటించడంతో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుంది. దీంతో పన్ను చెల్లించేందుకు అధిక సంఖ్యలో అసెస్‌మెంట్‌దారులు జీవీఎంసీ జోనల్ కార్యాలయానికి వస్తున్నారు. దీంతో బుధవారం ఆస్తి పన్ను చెల్లించే అసెస్‌మెంట్‌దారులతో జోనల్ కార్యాలయంలోని సౌకర్యం కేంద్రం కిటకిటలాడింది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ప్రజలు ఆస్తి పన్ను చెల్లించేందుకు వస్తుండడంతో వారి కోసం టెంట్లు కూడా ఏర్పాటు చేశారు. అసెస్‌మెంట్‌దారులు ఎక్కువసేపు క్యూలో వేచివుండకుండా త్వరితగతిన పన్నులు చెల్లించేలా జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు మాట్లాడుతూ పన్నులు చెల్లించేందుకు ప్రజలంతా ముందుకు వచ్చి ఐదు శాతం రాయితీని పొందాలని కోరారు. పన్ను చెల్లింపుదారులు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. త్వరితగతిన సేవలందించేందుకు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని, అందరూ పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని జెడ్సీ పేర్కొన్నారు.





గోపాలపట్నంలో ప్రచారంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్ సతీమణి మాలతి, తదితరులు

ఒక్క అవకాశం ఇచ్చి ఆనంద్‌కుమార్‌ను గెలిపించండి

వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి 'ఆడారి' సతీమణి మాలతి

గోపాలపట్నంలో విస్తృతంగా ప్రచారం

గోపాలపట్నం, ఏప్రిల్ 10: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థిగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా ఆనంద్‌కుమార్ సతీమణి ఆడారి మాలతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 91వ వార్డు పరిధి గోపాలపట్నం ప్రధాన రహదారిలో కార్పొరేటర్ బెహరా స్వర్ణలత శివదేవి ఆధ్వర్యంలో బుధవారం ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె పరిసర ప్రాంతాలతో పాటు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా ఆనంద్ కుమార్ బాధ్యతలు చేపట్టాక చేసిన అభివృద్ధి పనులను మాలతి వివరించారు. ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా ఆయనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకురాలు పేడాడ రమణికుమారి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసమానతలను రూపుమాపడంలో పూలే కృషి చిరస్మరణీయం

నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, తదితరులు

గోపాలపట్నం, ఏప్రిల్ 10: సమాజంలో అసమానతలు రూపుమాపడంలో మహాత్మా జ్యోతీరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్టీఎల్‌లో పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయనతో పాటు ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్ జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కులమతాల అసమానతలను రూపుమాపడంతో పాటు మహిళలను విద్యావంతుల్ని చేయడానికి పూలే చేసిన కృషి నిరుపమానమన్నారు. ఇటువంటి మహనీయులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. డాక్టర్ అబ్రహం వరుగీస్ మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను దూరం చేయడానికి పూలే చేసిన కృషిని వివరించారు. ఎన్ఎస్టీఎల్ ఏటీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ బి.భరతలక్ష్మి, ఎన్ఎస్టీఎల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అమర్‌జీత్, ఉర్బన్‌కుమార్, వర్క్స్ కమిటీ నాయకులు సీహెచ్ చంద్రశేఖరరావు, జెన్ వర్మ, నాగ భూషణం, మల్లిక్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

బొర్రమాంబ ఉత్సవాల వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

అగనంపూడి, ఏప్రిల్ 10: భక్తుల కొంగు బంగారం, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన అగనంపూడి బొర్రమాంబ అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాల కమిటీ ఛైర్మన్ చిత్తా గణేశ్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18న అమ్మవారి పుట్టబంగారు మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. అలాగే 22న తొలేళ్ల ఉత్సవం, కోటి దీపాల జాతర జరుపుతామని, 23న అమ్మవారి అనుపోత్సవాన్ని వైభవంగా చేపడతామని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా కోల్‌కతా లైటింగ్‌తో పాటు బాణసంచా కాల్చివేత, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చిత్తా కనకరాజు, గల్లా రాజు, ఎం.నరసింగరావు, కె.పైడిరాజు, సత్యారావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మతపెద్దకు దామా చారిటబుల్ ట్రస్టు చేయూత



మహ్మద్ రియాఉద్దీన్, తదితరులతో దామా సుబ్బారావు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 10: జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్‌నగర్‌లో పేద అయిన ముస్లిం మత పెద్ద మహ్మద్ రియాఉద్దీన్‌కు గృహ నిర్మాణం నిమిత్తం దామా చారిటబుల్ ట్రస్టు ద్వారా బుధవారం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని దామా సుబ్బారావు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేదలకు తనవంతు సహకారాన్ని అందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మస్తాన్, మున్నా, వాడపల్లి రామచంద్రరావు, మెడికల్ బాబు, ప్రసాద్, బాల, తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ కళావతిని సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం

అగనంపూడి, ఏప్రిల్ 10: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గల హోమియోపతి విభాగంలో బుధవారం అగనంపూడి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో హోమియోపతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియోపతి వైద్యాధికారి కె.కళావతిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హోమియోపతి వైద్యం సృష్టికర్త డాక్టర్ శామ్యూల్ హనీమాన్ జయంతి రోజునే హోమియోపతి దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ పెద్దలు బలిరెడ్డి సత్యనారాయణ, ఈశ్వరరావు, కె.తాతారావు, శివకుమార్, సుధారాణి, కె.కళావతి, సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: దీర్ఘకాలికమైన అనేక వ్యాధులను హోమియో వైద్యంతో అంతమొందించవచ్చని మింది ప్రభుత్వ హోమియో వైద్యాధికారి డాక్టర్ ఎ.శ్రీదేవి అన్నారు. ప్రపంచ హోమియో దినోత్సవం సందర్భంగా మింది ప్రభుత్వ హోమియో ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో హోమియో వైద్య పితామహుడు శామ్యూల్ హనీమాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాలనీ నాయకులు వెంకటరావు, ఈటి విజయ శంకరరావు, జి.కృష్ణారావు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 10: షీలానగర్ గవర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెంకటేశ్వరకాలనీలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని బుధవారం కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఆడారి లచ్చప్పారావు, ఉమామహేశ్వరరావు, ఎం.శ్రీని వాస్, మళ్ల నగేశ, తదితరులు పాల్గొన్నారు.

'ఉత్సవాలను విజయవంతం చేద్దాం'

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 10: కాలనీలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కోరారు. తుంగ్లాం కాలనీలో బుధవారం జరిగిన కాలనీ అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై త్వరలో చేపట్టే శ్రీరామనవమితో పాటు అమ్మవార్ల జాతర అంశాలపై చర్చించారు. సమావేశంలో కాలనీ నాయకులు కొల్లి అప్పలరెడ్డి, ఎన్.సింహచలం, పి.అర్జున్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కార్మికులను ఇబ్బందులకు గురి చేయవద్దు

ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 10: కార్మికులను ఇబ్బందులకు గురి చేసే చర్యలను ఉక్కు యాజమాన్యం విడనాడాలని ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ క్రమంలో యువ ఉద్యోగులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ప్లాంట్‌లో విధుల్లో చేరితే భవిష్యత్తు బాగుంటుందన్న ఆశతో ఉన్నవారంతా ఇప్పుడు తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్నారన్నారు. నూతన వేతన సవరణ చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మిక సంక్షేమంలో గుర్తింపు యూనియన్ తీవ్రంగా విఫలమైందని, ఇంటక్ గుర్తింపు యూనియన్‌గా ఉన్న సమయంలోనే కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు దక్కాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, బీఎస్ రాజు, బీఎంకే నాయక్, జి.ప్రభాకరరెడ్డి, కొవిరి అవతారం, కొమ్ము ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఉడుపు రాట

ఎన్.ఎ.డి. జంక్షన్, ఏప్రిల్ 10: జీవీఎంసీ 52వ వార్డు పరిధి పాత కరాస రామాలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలకు సంబంధించి బుధవారం ఉడుపు రాట వేశారు. ఇక్కడి ఆలయంలో గత 30 ఏళ్లుగా శ్రీరామనవమి వేడుకలను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 17న పండుగ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించడంతో పాటు భక్తులకు అన్న ప్రసాద వితరణను చేపడతామన్నారు.

17న సీతారాముల కల్యాణం

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా అక్కిరెడ్డిపాలెం రామాలయంలో వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆ రోజున సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నామని, ఇందుకు సంబంధించి వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ పందిరి రాట వేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.సుబ్రమణ్యం, బొడ్డు వెంకటరమణ, కామాడ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కోసం టీడీపీని గెలిపించాలి: పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



ప్రచారంలో పాల్గొన్న గణబాబు, తదితరులు

ఎన్.ఎ.డి. జంక్షన్, ఏప్రిల్ 10: యువతకు భవిష్యత్తులో ఉపాధి లభించాలంటే టీడీపీ గెలిపించాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి పి.గణబాబు పేర్కొన్నారు. 52వ వార్డు పరిధి పాత కరాస, రామమందిరం పరిసరాల్లో బుధవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తును కాపాడాలంటే ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న వైసీపీని ఓడించాలన్నారు. గణబాబుకు స్థానికులు పూలు చల్లుతూ, హారతులిస్తూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.వాసుదేవరావు, వై.తిరుమలరావు, చంద్రశేఖర్, దాడి వెంకటరమేశ్, తమ్మినాయుడు, శరత్‌చంద్ర, అంగటి రాము, మూర్తి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** గోకుల్, శ్రీకన్య, మౌర్య (గోపాలపట్నం) హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **లవ్ గురు :** శారద, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **శ్రీరంగనీతులు :** కిన్నెర, శ్రీ నరసింహ (గోపాలపట్నం),
- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడీ, సంగం, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), శ్రీకన్య-1, హెవెన్, సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి),
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి,
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 22, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 24, పచ్చి మిర్చి 44, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారేట్ 28, దొండకాయలు 20, బంగాళా దుంపలు 21, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 150, బరబటి 22, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90,గోరుచిక్కుడు 28, దోస కాయలు 12, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 110, పొటల్స్ 64, కీరదోస 22, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 90, కరివేపాకు(కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



ప్రశంసాపత్రాలతో నృత్య కళాకారులు

శ్రీవారి ఆలయంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 10: స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నృత్య నికేతన్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు బుధవారం చేసిన నృత్య ప్రదర్శన ఆహూతులను అమితంగా ఆకట్టుకున్నది. బుధవారం ఆలయంలో చేపట్టిన ప్రత్యేక పూజాది కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. టీచర్ హైమావతి ఆధ్వర్యంలో పలు భక్తీ గీతాలకు విద్యార్థులు చేసిన ప్రదర్శన ఆద్యంతం ఆధ్యాత్మికంగా సాగింది. నృత్యాలు చేసిన విద్యార్థినులను స్టీల్‌ప్లాంట్ సీజీఎం యు.శ్రీధర్ ప్రశంసాంపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్‌కు అభినందనలు



ఉక్కు డైరెక్టర్ (ఫైనాన్స్) గణేశ్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 10: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ఎస్ఆర్‌వీజీకే గణేశ్‌ను ఉక్కు కార్మిక సంఘ నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలియజేశారు. ప్లాంట్ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆర్థికంగా సంస్థను బలోపేతం చేయాలని, కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. అదేవిధంగా కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.మస్తానప్ప, పరదేశి, పిట్టా రెడ్డి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

గాజువాక, ఏప్రిల్ 10: ఎన్నికలు సరావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని గాజువాక ఎన్నికల అధికారి డి.లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. టీఎస్సార్, టీబీకే కళాశాలలో బుధవారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్ల స్లిప్‌ల నుంచి పోలింగ్ పూర్తయ్యేంత వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీల కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 10: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్లు అయిన అంబేడ్కర్ కళాక్షేత్రం, ఆంధ్రకేసరి కళాక్షేత్రాలను శుభ కార్యక్రమాలకు కోసం బుకింగ్ చేసుకునేవారు ఆగస్టు నెల కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని ఉక్కు అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు గురజాడ కళాక్షేత్రానికి మాత్రమే ఈ సదుపాయం ఉండగా ఇప్పుడు మిగతా రెండు సీడబ్ల్యూసీలకు అమలు చేయనున్నారు.

'రాజధాని లేని రాష్ట్రం ఏపీయే'

మల్కాపురం, ఏప్రిల్ 10: దేశంలోనే రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని ఇండియా కూటమి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి అత్తిలి విమల విమర్శించారు. బుధవారం మల్కాపురంలో సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు కె.సత్యాంజనేయ, జి.రాంబాబు, మరియదాసు, రమణ, నూకరాజు, పైడిరాజు, పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యం వల్ల సమాజం ప్రభావితం కావాలి



సాహితీవేత్త డాక్టర్ గాయత్రీ దేవిని సత్కరిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ, ఏప్రిల్ 10: సాహిత్యం సమాజాన్ని సవ్య దిశలో నడిపేవిధంగా ఉండాలని, సాహిత్యం వల్ల సమాజం ప్రభావితం కావాలని ప్రముఖ సాహితీవేత్త, రచయిత్రి డాక్టర్ గాయత్రీదేవి అభిప్రాయపడ్డారు. సాహిత్యసుధ 25వ వార్షికోత్సవాన్ని బుధవారం హెచ్‌బీకాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా సాహిత్యంలో కూడా మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాహిత్యసుధ వ్యవస్థాపకులు అద్దంకి రాఘవాచార్యులు మాట్లాడుతూ తెలుగు సాహిత్యం అన్ని కోణాల్లోను విస్తరిస్తుందన్నారు. గౌరవాధ్యక్షుడు వీఎస్ఆర్ ప్రసాద్, డాక్టర్ పైడి హేమలత, డాక్టర్ డి.సుజాత, తదితరులు పాల్గొన్నారు. ఆముక్తమాల్యద గ్రంథంపై పీహెచ్‌డీ చేసిన డాక్టర్ గాయత్రిదేవిని ఘనంగా సత్కరించి కవనశ్రీ బిరుదును ప్రదానం చేశారు.

'ఉక్కు ప్రైవేటీకరణ యోచనను విడనాడాలి'

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 10: స్టీల్‌ప్లాంట్ విక్రయించాలనుకునే యోచనను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,154వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు తాము ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంపై జరుగుతున్న దాడిని ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలన్నారు. ఉక్కును కాపాడుకునేందుకు పోరాటాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్యం ఇలా ఉంటే.. వ్యాధులు రావా?

» అధ్వానంగా దొండపర్తి పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10: గ్రేటర్ 27వ వార్డు దొండపర్తి పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. వీటినుంచి మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తుండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. డ్రైనేజీలోని మురుగు తొలగించడంలో పారిశుధ్య కార్మికులు నిర్లక్ష్యం వహిస్తుండడంతోనే ఈ దుస్థితి నెలకొంటోంది. నెహ్రూ బజారు సమీపాన, గ్రంథాలయం పరిసర ప్రాంతాల్లోని డ్రైనేజీల్లో మురుగు, చెత్త పేరుకుపోతోంది. ఈ వార్డుకు కొన్ని నెలల పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో సచివాలయ శానిటేషన్ కార్యదర్శి ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత కొద్ది రోజుల తర్వాత పూర్తిస్థాయి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు. అయినా, పారిశుధ్య పనులు మెరుగుపడలేదు. వార్డులో పలు డ్రైనేజీలు మురుగుతో నిండిపోతుండడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే వీలుంది. పారిశుధ్య కార్మికులు పట్టించుకోకపోవడంతో దుర్వాసనన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి డ్రైనేజీల్లోని మురుగు తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ప్రాంతీయ గ్రంథాలయం సమీపంలో మురుగునీరు

సమాజం భాష, సంస్కృతి పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట, ఏప్రిల్ 10: సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్షులు శేఖర మంత్రి ప్రభాకర్ అధ్యక్షతన ఆచార్య వెలమల సిమ్మన రాసిన సమాజంభాష, సంస్కృతి పుస్తకావిష్కరణ బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిజం విద్యా సంస్థల అధినేత ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య సిమ్మన్న సేవలు తెలుగు సాహిత్యానికి వెల కట్టలేమన్నారు. ఈ పుస్తకాన్ని రచయిత ఆచార్య వెలమల సిమ్మన్న శేఖర మంత్రి ప్రభాకర్‌కి అంకితం చేశారు. పుస్తక రచయిత ఆచార్య సిమ్మన్న మాట్లాడుతూ తన గ్రంథాలు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని విద్యార్థులకు, భాషాభిమానులకు, ఆచార్యులకు అందరికి ఉపయోగపడడం చాలా ఆనందం కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డీవీ సూర్యారావు, డాక్టర్ కేజీ వేణు, సీహెచ్ సూర్యానారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు


రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థినులు

వన్రిపాలెం, ఏప్రిల్ 10: రవీంద్ర భారతి స్కూల్లో బుధవారం రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఒకరి కొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. విద్యార్థుల్లో సమ భావం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వెంకటేష్ పాల్గొన్నారు.

సీతంపేట: ద్వారకానగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో కిడ్స్ కాన్వొకేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ నవ్యశ్రీ చిన్నారి విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు వారిని సన్మానించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాయి సౌందర్య, జెడ్‌బి వెంకటేష్, సీజీఎం వసంత, డీన్ సుదలత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గండిబాబ్జీ


అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10: టీడీపీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జి సమక్షంలో వైసీపీ నుంచి యువకులు బుధవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బాబ్జీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో గతంలో టీడీపీ కార్యకర్తలను స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ టిడ్కో ఇళ్లు ఇస్తామని మభ్యపెట్టి వైసీపీలో వీరిని చేర్పించారు. వీరంతా మళ్లీ వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇచ్చేది తమపార్టీయేనని అన్నారు. వైసీపీ ఎన్నో ప్రలోభాలకు గురి చేస్తోందని చెప్పారు. టీడీపీ కార్యకర్తలు వైసీపీ ఉచ్చులో పడొద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు: సీపీ


నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్‌తో ఏపీ ఛాంబర్స్ బృంద సభ్యులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 10: ఏపీ ఛాంబర్స్ బృందం బుధవారం నగర పోలీస్ కమిషనర్ డా.ఏ.రవిశంకర్‌తో సమావేశమయ్యారు. సీపీ నూతనంగా ఫోకస్డ్ స్ట్రెచ్ మేనేజ్‌మెంట్‌పై చర్చించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ట్రాఫిక్ వాలంటీర్లతో 24/7 365 రోజులు ఈ స్ట్రెచ్‌లను బలోపేతం చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చునన్నారు. విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం ఉన్నందున ఏపీ ఛాంబర్స్ ఈ కొత్త కార్యక్రమానికి మద్దతు ఇవ్వడానికి అంగీకరించింది. ఈ సమావేశంలో ఛైర్మన్ శ్రీచిట్టూరి శ్రీనాథ్, వైస్ ఛైర్మన్ పి.శోభన్‌ప్రకాష్, వైస్ ఛైర్‌పర్సన్ ఎ.లీలారాణి, డా.జి.సాంబశివరావు, ఈసీ మెంబర్ సుధీర్ ములగాడ, ఏపీసీ ట్రాఫిక్ రాజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

14న చంద్రబాబు అనకాపల్లి జిల్లా పర్యటన



అనకాపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 14న అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటలకు పాయక రావు పేటలో జరిగే ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు చోడవరంలో జరిగే ఎన్ని కల ప్రచార సభలో కూడా పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బుద్ద పిలుపునిచ్చారు.

31వ వార్డు వైసీపీ నేత రాజీనామా

- చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిక


నవీన్‌కుమార్‌కు పార్టీ కండువావేసి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 10: దశాబ్ద కాలంపైగా వైసీపీలోనున్న గ్రేటర్ విశాఖ 31వ వార్డుకు చెందిన బత్తిన నవీన్‌కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఆయన ఆ పార్టీలో చేరారు. బుధవారం సీతారాజు సుధాకర్ ఆధ్వర్యంలో వార్డు నుంచి ఆయనతో పాటు పలువురు కార్యకర్తలు వెళ్లి టీడీపీలో చేశారు. కాగా, 31వ వార్డు వైసీపీ పార్టీ తరఫున గతంలో కార్పొరేటర్ అభ్యర్థిగా బత్తిన నవీన్‌కుమార్ పోటీ చేశారు. వార్డులోని వైసీపీని వీడడంతో ఆ పార్టీకి షాక్ తగిలినట్టని రాజకీయ పరిశీలకు అంటున్నారు.

గ్రూప్-2 ఎంపికలో మార్పుపై హర్షం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10: గ్రూప్-2 ప్రశ్నాపత్రం పెద్దపెద్ద ప్రశ్నలతో తక్కువ సమయం కేటాయించడంతో చాలామంది అభ్యర్థులు అర్హత కోల్పోతారని ఏపీపీఎస్సీ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ తెలిపారు. ఈ అభ్యర్థనను అర్థం చేసుకుని ఎంపిక విధానంలో మార్పుచేసినట్టు చెప్పారు. గ్రూప్-2 ప్రధాన పరీక్ష జూలై చివరిలోనైనా, ఆగస్టులో గానీ పెట్టాలని కోరారు.

రియల్ ఢమాల్

... 5వ పేజీ తరువాయి

భారం కావడంతో ఆర్థికంగా స్థోమత కలిగినవారు తప్ప మధ్య తరగతి ప్రజలు ఫ్లాట్లు, ఇళ్ల కొనలేకపోతున్నారు. దాంతో రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం పడిపోయింది.

ఏడాదిగా నిలిచిన పెట్టుబడులు

వైసీపీ అధికారంలోకి వచ్చాక అమరావతి రాజధాని కాదని, అక్కడ అభివృద్ధి పనులు ఆపేసింది. విశాఖపట్నం పరిపాలనా రాజధాని అంటూ ఇక్కడ ఆ పార్టీ నాయకులు స్థిరాస్తులు సమకూర్చుకున్నారు. ఆ మాటలు నిజమవుతాయని కొందరు చేతిలో ఉన్న డబ్బులు ఇక్కడ పెట్టుబడులు పెట్టారు. రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మారడం, ఎన్నికలు కూడా రావడంతో కొత్తగా పెట్టుబడులు పెట్టేవారు ఏడాదికాలంగా ఆగిపోయారు. ఎన్నికల తరువాత పరిస్థితిని బట్టి చూసుకోవచ్చునని వేచి ఉన్నారు. వీటన్నింటి నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయింది.

స్వయం ఉపాధి శూన్యం

... 5వ పేజీ తరువాయి

మత్స్యకారులకు చెరువులు కేటాయింపు, బోట్ల ఆధునికీకరణ, వృత్తుల వారీగా అవసరమైన పరికరాలు పంపిణీ, మహిళా పారిశ్రామిక వేత్తలకు రాయితీలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సహాయం, నేతన్నలకు పావలా వడ్డీకి రుణాలు, కొత్త మగ్గాలు కొనుగోలుకు సబ్సిడీలు, మల్బరీ తోటల పెంపకానికి ప్రోత్సాహం, గీత కార్మికుల సొసైటీలకు ఆర్థిక సాయం, ఈత, తాటిచెట్ల పెంపకానికి ప్రోత్సాహం, గొర్రెలు, మేకలు పెంపకానికి ప్రోత్సా హంతోపాటు ఆయా కులాలు ఆర్థికంగా, సామా జికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన సహకారాన్ని కార్పొరేషన్లు అందించేవి. ఆదరణ పేరుతో వివిధ వృత్తులు చేసుకునే వారికి అవసరమైన పరికరాలను పెద్దఎత్తున పంపిణీ చేశారు. రజకులకు ఇస్త్రీ పెట్టెలు, లాండ్రీ మిషన్లు, దోబీ ఖానాలు అభివృద్ధికి అవసరమైన నిధులు, నాయీ బ్రాహ్మణులకు అవసరమైన పరికరాలు, కమ్మరి, కుమ్మరి, మత్స్య కారులకు అవసరమైన పరికరాలను ఉచితంగా అందించి వారి వృత్తుల్లో మరింత మెరుగైన పనితీరు కనబరిచేలా చేసి మరింత ఆదాయాన్ని పొందేందుకు ప్రభుత్వం సహకారాన్ని అందించింది. టీడీపీ ప్రభుత్వం చివరి రెండేళ్లలో బీసీ, ఎస్సీ యువతకు ఆటోలు, వ్యాన్లు ట్రాక్టర్లు, కార్లు వంటి వాహ నాలను అందించింది. వీటి ద్వారా సుమారు 300 మంది వరకూ ఉపాధి పొందారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వెట్టి, జోగినులకు పునరావాస కార్యక్రమాలు, పేదల రైతుల పొలాల్లో బోర్లు, పంపుసెట్లు, విద్యుత్ సౌకర్యం, భూమి అభివృద్ధి, భూమి లేని పేదలకు భూములు కొనుగోలు చేసి అందించడం, వడ్డీ లేని రుణాలు ఇవ్వడం వంటి వాటిని అమలు చేశారు. జగన్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించి ఛైర్మన్లను మాత్రమే నియమించింది. ఈ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి పథకాలను అమలు చేయలేదు. ఒక్క పైసా కూడా ఇవ్వలేదు.

ఉపాధికి అవకాశం ఏదీ..?

గత తెలుగుదేశం పార్టీ హయాంలో లక్షల రూపాయల రుణాలుగా అందించడం ద్వారా యువత స్వయం ఉపాధి పొందేందుకు అనుగుణమైన యూనిట్లు ఏర్పాటుచేసుకునే వారు. కానీ, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా పథకాలను పూర్తిగా నిలిపివేసింది. జగనన్న చేదోడు కింద పది వేలు, కాపు నేస్తం కింద రూ.15 వేలు, ఈబీసీ నేస్తం కింద రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని మాత్రమే వైసీపీ చేస్తోంది. ఈ మొత్తాలతో ఉపాధి పొందడం ఎలా సాధ్యమవుతుందని ఆయా కులాలకు చెందినవారే ప్రశ్నిస్తున్నారు. యువత ఉపాధి పొందేందుకు అనుగుణంగా నిధులను అందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన తరువాత పెళ్లి కానుక, రంజాన్ తోఫా వంటి పథకాలను పూర్తిగా ఆపేసిన వైసీపీ ప్రభుత్వం.. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో గత ఏడాది నుంచి విదేశీ విద్య, పెళ్లి కానుకను అమలు చేస్తోంది.

భీమిలి బీచ్‌రోడ్డులో ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. కాగా, ఈ విషయమై, రుషికొండ ఎంఆర్ బాయ్స్ హాస్టల్ వద్ద నివాసం ఉంటున్న చినఅప్పలరాజు సోదరుడు, సీసీ టీవీ టెక్నీషియన్ అప్పలరాజు తమకు ఫిర్యాదు చేశారన్నారు. తన తమ్ముడైన చినఅప్పలరాజు తన స్నేహితుడు వాహనం ఆగిపోయిందని చెప్పి స్కూటీని అర్ధరాత్రి 12.25 గంటలకు తీసుకువెళ్లాడని, తర్వాత 12.50 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ప్రమాదం జరిగిందని, కేజీహెచ్‌కు తీసుకువెళుతున్నామని తెలిపాడని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. పూర్తి వివరాలు అందవలసి ఉందన్నారు. కాగా, భీమిలిలో అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్నాయి. పండగకు వచ్చి వెళుతున్న వాహనం ఒకటి, పండగకు వస్తున్న వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. చేపల తిమ్మాపురం వద్ద వంతెన మరమ్మతులు జరుగుతున్నందున ఒకవైపు రహదారిని మూసివేసి, తొట్లకొండ వరకూ రహదారిని వన్‌వేగా మార్పు చేయడంతో ఆ ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో పోలీసు అధికారులు మరిన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎండీయూ ఆపరేటర్లకు వైసీపీ నేతల గేలం?

... 5వ పేజీ తరువాయి

తీసుకున్న వ్యక్తులెవరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదు. దీనిని పరిగణనలోకి తీసుకుని అధికార పార్టీ నేతలు అన్ని జాగ్రత్తలు తీసుకుని ఎండీయూ ఆపరేటర్లతో రహస్యంగా సమావేశమై తమ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయాలని కోరుతున్నారు. ఇందుకు అధికార పార్టీ కార్పొరేటర్లు/బియ్యం వ్యాపారులను రంగంలోకి దింపారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించాలని సూచించారు. ఈనెలలో బియ్యం పంపిణీ చేసినప్పుడే కొందరు ఎండీయూ ఆపరేటర్లు కొందరు ఓటర్లను ప్రభావితం చేసేందుకు యత్నించారు. ఇదిలావుండగా నగరంలో రేషన్ డీలర్ల సంఘ నేతలు, కొందరు డీలర్లు కలిసి నాలుగైదు రోజుల క్రితం బీచ్‌రోడ్డులో ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ మంత్రి వద్దకు వెళ్లారు. తమ సమస్యలు పరిష్కరిస్తే మద్దతు ఇస్తామని చెప్పారు.

బార్‌ల యజమానుల నుంచి వైసీపీ నాయకులకు మామూళ్లు

» జనసేన, టీడీపీ నేతలు ఆరోపణ

సీతంపేట, ఏప్రిల్ 10: విశాఖ జిల్లాలోని మద్యం బార్‌లనుంచి నెలకు రూ. 6 కోట్ల మేర లంచాలు వసూలు కాగా, ఇందులో రూ. 3 కోట్లు అధికార పార్టీ పెద్దలకు చేరుతున్నట్టు జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. విడతల వారి సంపూర్ణ మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఢిల్లీలో ప్రభుత్వాన్ని మించిన మద్యం స్కామ్ చేస్తోందని ఆయన విమర్శించారు. స్థానిక బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రాలో తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా జరుగుతున్న స్కామ్ విలువ రూ. 50 వేల కోట్లకు పైనే అని అన్నారు. ఏటా రాష్ట్రంలో రూ. 30వేల కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, ఇందులో రూ. 10 వేల కోట్ల వరకూ లంచాల రూపంలో ప్రభుత్వ పెద్దలు, అధికారులకు చేరుతోందన్నారు. విడిపోయిన విశాఖ జిల్లాలోనే రూ. 130 వరకూ బార్‌లు ఉన్నాయని, వీటి నుంచి నెలకు రూ. 5 లక్షల చొప్పున రూ.7.50 కోట్ల లంచాన్ని ఎక్సైజ్ ఉన్నతాధికారి ఆధ్వర్యంలో వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో రూ. 3 కోట్లు ఉత్తరాంధ్ర వ్యవహారాలు చూసే పార్టీ పెద్దలకు చెల్లిస్తున్నారన్నారు. గతంలో నాలుగేళ్లపాటు ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్‌చార్జి విజయసాయిరెడ్డి ఆశీస్సులతో శ్రీనివాస్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేయగా, ప్రస్తుతం సీఎం పేషీ ముఖ్య అధికారి ధనుంజయరెడ్డి శిష్యుడిగా చెలామణి అవుతున్న సుధీర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వ వైన్‌షాపుల్లో జనాలు కోరుకొనే మద్యం లేకుండా చేయ డం, రాత్రి ఎనిమిది గంటలకే దుకాణాలు మూసివేసి బార్‌లకు లబ్ధి చేకూర్చేందుకు నిబంధనలు పెడుతున్నారన్నారు. వీటితో పాటు బార్‌లలో జరిగే ఉల్లంఘనలపై కేసులు లేకుండా చేయడం, అదనపు సమయాలకు అనుమతిచ్చి వారినుంచి లంచాలు గుంజుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

ఎన్నికల నిబంధనలు అనుసరించాలి


మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

జ్ఞానాపురం, ఏప్రిల్ 10: ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో పెట్టే సమయంలో అన్ని రాజకీయ పార్టీలు హాజరు కావాలని పశ్చిమ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారంజ్ఞానాపురంలోని పశ్చిమ నియోజకవర్గం ఆర్వో కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పక్షాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 19న షెడ్యూల్ విడుదల అనంతరం రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను వివరించారు.

భవిత కేంద్రానికి ఎస్సీ, ఎస్టీ సంఘం విరాళం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 10: ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీ ఎంసీ ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ల సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు పి.ఆదినారాయణ రూ.2వేలు నగదు విరాళం అందజేశారు. హెచ్ఎం బి.లక్ష్మీ నరస, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శారద, జగదాంబకు ఆ నగదును అందించారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రొడక్షన్ మేనేజర్ చెంగల సునీల్, సంఘం సభ్యులు చెంగల చిన్నారావు, శ్రీను పాల్గొన్నారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో భానుప్రకాశ్‌కు స్వర్ణాలు


పతకం అందుకుంటున్న భానుప్రకాశ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 10: ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో నగరానికి చెందిన పుష్పాల భానుప్రకాశ్ మూడు స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నా డు. నేపాల్‌లో జరిన ఈ మీట్‌లో 45 ప్లస్ పురుషుల విభాగంలో 100మీ, 200మీ., 400మీ. పరు గులో బంగారు పతకాలు సొం తం చేసుకుని సత్తా చాటాడు. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ టోర్నీ లో మూడు స్వర్ణ పతకాలు సాధించి దేశానికి ఖ్యాతి తెచ్చిన భానుప్రకాశ్‌ను పలువురు మాస్టర్ అథ్లెట్లు అభినందించారు.

తాగునీటి పైపులైన్ పనులు


పైప్‌లైన్ కోసం తవ్వకాలు

మాధవధార, ఏప్రిల్ 10 ; గ్రేటర్ 50వ వార్డు మాధవధార రోడ్డులో చేపడుతున్న తాగునీటి పైపులైను పనులు చేపడుతున్నారు. ఎగువ మాధవధార కొండకు చేరే దారి నుంచి దిగువ 48ఏ బస్టాపు వరకు మెయిన్ లైన్‌కు అనుసంధానిస్తూ ఈ పనులు చేపడుతున్నారు. వేసవిలో తాగునీటి అవసరాల్ని దృష్ట్యా కాంట్రాక్టు ప్రాతిపదికన కొత్తపైపు లైను వేస్తున్నారు. దీంతో మాన్యం, మాధవధార శంకర్‌నగర్, పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా సక్రమంగా మెరుగవనుంది.

3, 4 ప్లాట్‌ఫారాలపై రైళ్ల పునరుద్ధరణ

» కొనసాగుతున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో 3, 4 ప్లాట్‌ఫారాలపై రైళ్ల రాకపోకలను బుధవారం పునరుద్ధరించారు. రెండు రోజుల క్రితం దక్షిణం వైపు గల మూడో గేటు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి కుంగిపోయిన సంగతి తెలిసిందే. అది సరిగ్గా 3, 4 ప్లాట్‌ఫారాలపై ఉండడంతో వాటిపైకి రైళ్ల రాకపోకలు నిలిపేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ నేతృత్వంలో చీఫ్ బ్రిడ్జి ఇంజనీర్ రాజ్‌కుమార్, చీఫ్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇంజినీర్ బి.శ్రీనివాసరావు, తదితరులు దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. అయితే ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు ఇంకా కొనసాగుతున్నందున, వాటిని క్షుణ్ణంగా పరిశీలించాకే ప్రయాణికులను దానిపైకి అనుమతిస్తామని, అంతవరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.


ఫుట్ ఓవర్ బ్రిడ్జిని అమరుస్తున్న దృశ్యం



కల్యాణం చేస్తున్న అర్చకులు

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఏప్రిల్ 10 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా బుధవారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణ జరిపి, అక్షితారోపణ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు చేసి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

భీమిలి కాంగ్రెస్ అభ్యర్థిగా వర్మ



తగరపువలస, ఏప్రిల్ 10 : జీవీఎంసీ రెండో వార్డు బ్యాంకు కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అడ్డాల వెంకటవర్మను పార్టీ అధిష్ఠానం భీమిలి నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించింది. ఈమేరకు పీసీసీ చీఫ్ షర్మిల బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకట వర్మ గతంలో వైసీపీ కార్యకర్తగా పనిచేశారు.ఇటీవల ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కొత్త కుర్చీలు వద్దు

ఎంపీపీ కాలనీ, ఏప్రిల్ 10 : ఎంవీపీ కాలనీలో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో ఇప్పటికే ఉన్న కుర్చీలను సరిగ్గా వినియోగించకపోవడంతో అవి ఓ మూలన పడి ఉన్నాయి. మళ్లీ కొత్తగా కుర్చీలు ఇస్తామంటూ టీటీడీ ఉన్నతాధికారులు లేఖ రాయడంతో వాటిని ఎక్కడ పెట్టాలో తెలియక, మాకు వద్దు మహోప్రభో అంటూ ఇక్కడి అధికారులు తిరిగి లేఖ రాశారు. ఇప్పటికే కల్యాణ మండపంలో ఉన్న కుర్చీలను వినియోగదారులు వాడడం లేదు. వారు బయట సప్లయర్స్ నుంచి సోఫాలు, కుషన్‌తో కూడిన మెత్తని కుర్చీలు తెచ్చుకుంటున్నారు. మండపంలో కుర్చీలు ఓ మూలన ఉన్నాయి. అధికారులు ఇంకా ఇస్తామని చెప్పడంతో ఉన్నవే వాడడం లేదు కనుక కొత్త కుర్చీలు వద్దంటూ టీటీడీ మేనేజర్ హైమావతి ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, ఏప్రిల్ 10 : మధురవాడ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మధురవాడ మెయిన్ రోడ్, భగవాన్‌దాస్ కాలనీ, ఎంఎస్‌ఆర్ లేఅవుట్, సాయిప్రియా లేఅవుట్, చంద్రంపాలెం, భాస్కర్‌నగర్, సంపత్‌నగర్, ఉజ్వల ఆస్పత్రి ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

సామాజిక కార్యకర్త శ్రీనివాసరెడ్డికి సన్మానం

తగరపువలస, ఏప్రిల్ 10 : తగరపువలసకు చెందిన సామాజిక కార్యకర్త వి. శ్రీనివాసరెడ్డిని నగరంలోని రాంనగర్‌లో ఏక్టివ్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఉగాది వేడుకలు పురస్కరించుకుని ఆయన చేస్తున్న కార్యక్రమాల దృష్ట్యా సన్మానం చేశారు.

‘ఉక్కు ప్రైవేటీకరణ యోచనను విడనాడాలి’

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 10 : స్టీల్‌ప్లాంట్ విక్రయించాలనుకునే యోచనను బీజేపి ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,154వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ అందరి లక్ష్యమన్నారు.

సినిమా గైడ్

- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** గోకుల్, శ్రీకన్య, మౌర్య (గోపాలపట్నం) హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **లవ్ గురు :** శారద, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **శ్రీరంగనీతులు** : కిన్నెర, శ్రీ నరసింహ (గోపాలపట్నం),
- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), శ్రీకన్య-1, హెవెన్, సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి),
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి,
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 22, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజీ 24, క్యారేట్ 28, దొండకాయలు 20, బంగాళా దుంపలు 21, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 150, బరబటి 22, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90,గోరుచిక్కుడు 28, దోస కాయలు 12, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 110, పొటల్స్ 64, కీరదోస 22, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 90, కరివేపాకు(కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..



అన్నవరంలో ఎం.శ్రీభరత్, గంటా శ్రీనివాసరావు ప్రచారం



ర్యాలీ



మజ్జివలసలో గంటా సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

భీమిలిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- టీడీపీ అభ్యర్థి గంటా
- ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌తో కలిసి ప్రచారం మొదలు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 10: భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. జిల్లాలో భీమిలికి పర్యాటకంగా ఒక ప్రత్యేకత ఉందని, దాన్ని దేశవ్యాప్తం చేస్తానని చెప్పారు. బుధవారం ఉదయం ఆయన అన్నవరం గ్రామం నుంచి పార్టీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌తో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ముందుగా మత్స్యకార గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆ తరువాత గ్రామంలో రోడ్‌షో నిర్వహించి అక్కడి నుంచి నాగమయ్యపాలెం, ఎర్రయ్యపాలెం గ్రామాల మీదుగా మహారాజుపేట కూడలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ తన పట్ల అభిమానంతో పార్టీలో చేరుతున్న నాయకులందరికీ స్వాగతం పలుకుతున్నానన్నారు. గతంలో విద్యా శాఖా మంత్రిగా భీమిలిలో అనేక అభివృద్ధి పనులు చేశానని, ఇప్పుడు మరిన్ని పనులు చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. వైసీపీ పాలనతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, చంద్రబాబు పాలన కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. అంతకుముందు ఆయన అన్నవరం నుంచి మజ్జివలస వరకు ర్యాలీగా వచ్చి రాసపోలమ్మ ఆలయంలో శ్రీభరత్‌తో కలిసి పూజలు నిర్వహించారు. అక్కడ టీడీపీ మండల అధ్యక్షుడు డీఎస్ఎన్ రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ఆధ్వర్యంలో సింగనబంద సర్పంచ్ నారాయణ, లక్ష్మీపురం సొసైటీ డైరెక్టరు తాతి నాయుడు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు టీడీపీలో చేరారు. వారికి గంటా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



తగరపువలసలో జరిగిన సమావేశంలో వైసీపీ నాయకులతో శ్రీనివాసరావు



ముత్తంశెట్టికి హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

వైసీపీ వస్తే విశాఖే రాజధాని : ముత్తంశెట్టి

పద్మనాభం, ఏప్రిల్ 10 : వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖను రాజధాని చేస్తామని ఆ పార్టీ భీమిలి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం ఆయన గెద్దపేట, కోరాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్ర అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. రాజకీయం అంటే వ్యాపారంగా భావించే టీడీపీ అభ్యర్థికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఉత్తర ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ప్రజలకు ముఖం చూపించలేదన్నారు. కోరాడ పంచాయతీలో రూ. 22 కోట్లు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వ్యయం చేశామన్నారు. అంతకముందు గెద్దపేట నుంచి కోరాడ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బుడ్డివలస, బీఆర్ తాళ్లవలసలో కూడా ప్రచారం నిర్వహించారు. వైసీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, వైస్ ఎంపీపీ మంజు, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందించిన ఘనత జగన్‌కు మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సాయంత్రం తగరపువలసలో జరిగిన పార్టీ నియోజకవర్గస్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమిలి నియోజకవర్గానికి ఐదేళ్లలో రూ. 2500 కోట్ల నిధులు అందించామని, 500 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు చేశామని చెప్పారు.వచ్చే ఎన్నికల్లో తనతో పాటుఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను, నాయకులు దాట్లప్రసాదరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ వైవీ సూర్యనారాయణ, సర్పంచులు చెల్లూరి పైడపప్పుడు, కాద సూర్యనారాయణ, వెంపాడ రమావతి, మజ్జి సూరినాయుడు, నగరపాలెం సర్పంచ్ చాయా గౌతమి, తాటితూరు, బొడమిట్లపాలెం, లక్ష్మీపురం సర్పంచ్ జగదీశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు బోని బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు

కొండవాలు ప్రజలకు ఇళ్ల పట్టాలు : వెలగపూడి

ఆరిలోవ, ఏప్రిల్ 10 : టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కొండవాలు ప్రాంతంలో ఉన్నవారికి ఇళ్ల పట్టాలిస్తామని ఆ పార్టీ తూర్పు అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు హామీ ఇచ్చారు. బుధవారం ఆయన 12వ వార్డు చినగదిలి సాయిబాబా గుడి ప్రాంతం, రాధాకృష్ణనగర్, కొండవాలు ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా కొండవాలు ప్రాంతంలో ఏళ్ల తరబడి ఉంటున్న తమకు ఇళ్ల పట్టాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అనంతరం వెలగపూడి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జీఓ 229 ద్వారా పేదలకు ఉచితంగా పట్టాలివ్వాలని నిర్ణయించామని, కానీ కొందరు కోర్టుకు వెళ్లడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అర్హులందరికీ పట్టాలిస్తామని హామీ ఇచ్చారు.



వెలగపూడికి హారతి ఇస్తున్న మహిళ

అలాగే కొండవాలు ప్రాంతంలో ప్రతి ఇంటికి పైలట్ వాటర్ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందిస్తామని తెలిపారు. 11వ వార్డు ఆరిలోవ, బాలాజీనగర్ ప్రాంతాల్లోనూ వెలగపూడి ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, శ్రీభరత్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడు సత్యం, భరత్, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, దువ్వి తాతారావు, రాగతి అచ్చుతరావు, ముగడ రాజారావు, ఆబోతుల అప్పలనాయడు, మూది అప్పారావు, కృష్ణంరాజు, బీజేపీ నాయకులు సన్యాసిరావు, జనసేన నాయకులు రాము, జ్యోతి, జయ, లక్ష్మి, మంగరాజు పాల్గొన్నారు.

ఎండుతున్న చెరువులు

మధురవాడ, ఏప్రిల్ 10 : వేసవి తీవ్రత దృష్ట్యా మధురవాడ పరిసరాల్లోని చెరువులు ఎండిపోతున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల బోర్లు నుంచి అవసరం మేరకు నీరు రావడం లేదని వాపోతున్నారు. ఒకవైపు నీటి వినియోగం పెరగడం, మరోవైపు చెరువులు, గెడ్డలు వంటి జల వనరులు ఎండుపోతుండడంతో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షాకాలంలో నిండుగా నీటితో కళకళలాడిన శిల్పారామం చెరువులో ప్రస్తు తం చుక్కనీరు లేదు. బొట్టవానిపాలెం ఎండోడు చెరువు,నగరంపాలెం రాళ్ల చెరువు కూడా నీరు లేక బీటలు వారాయి. మరికొన్ని స్థానికుల నిర్లక్ష్యం వల్ల ఎండిపోయాయి. డెబ్రిస్ వంటి వాటిని చెరువుల్లో వేయ డంతో పాటు పనికిరాని వ్యర్థాలను, ప్లాస్టిక్ సామాన్లు చెరువులు, గెడ్డల్లో వేయడంతో అవి నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యం కోల్పోయాయి. ఎండల తీవ్రతకు చెరువులు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటాయి. అధికారులు స్పందించి జల వనరుల్లో పూడికలు తీయిస్తే వర్షాకాలంలో అయినా అవి నీటితో నిండుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



చుక్క నీరు లేని శిల్పారామం చెరువు

‘టీడీపీ పాలనతోనే అన్ని వర్గాల అభివృద్ధి’

వెంకోజీపాలెం, ఏప్రిల్ 10 : రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి టీడీపీ పాలనతోనే సాధ్యమని ఆ పార్టీ 16వ వార్డు అధ్యక్షుడు నారు గోపి అన్నారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వెలగపూడికి మద్దతుగా 16వ వార్డులోని ఇసుకతోట ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలను తెలియజేస్తూ, వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముగడ వాసు, బంగార్రాజు, మొల్లి శంకర్, పల్లా ఉమారాణి, మొల్లి శోభ, జి. అప్పన్న, ఆర్. నూకరాజు, కె. శ్రీను, ఆర్. భరత్‌కుమార్, పి. అప్పలరాజు పాల్గొన్నారు.

గంటాకు మద్దతుగా...

సాగర్‌నగర్ : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉం టుందని టీడీపీ నాయకురాలు ఆశాజ్యోతి అన్నారు. బుధవారం ఆమె 8వ వార్డు సుభాష్‌నగర్‌లో టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇం టింటికి వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సహదేవ్ యాదవ్, సారిపల్లి శ్రీనివాసరావు, బి. దొరబాబు, చెట్టుపల్లి సన్యాసిరావు, చిన్నగోపి, అక్కరబోయిన రాంబాబు, మంగాదేవి, జనసేన నాయకుడు శ్రీనివాసరావు, శిరీష పాల్గొన్నారు.

రోడ్డు పక్కన డెబ్రిస్‌తో ఇబ్బందులు

సింహాచలం, ఏప్రిల్ 10 : జీవీఎంసీ 98వ వార్డు శివారు పాత అడివివరం నుంచి భైరవవాకకు వెళ్లే మార్గంలో భారీ ఎత్తున డెబ్రిస్ పేరుకుపోయింది. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే వీలులేక పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. డెబ్రిస్‌లోని కొన్ని రాళ్లు రోడ్డు మీదకు రావడంతో ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు పక్కన గుట్టలుగా ఉన్న డెబ్రిస్



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

నూకాలమ్మ ఆలయ హుండీల లెక్కింపు

భీమునిపట్నం, ఏప్రిల్ 10 : భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ ఉత్సవాల సందర్భంగా భక్తుల నుంచి రూ.10. 69 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ బొంగరాల మురళీమోహన్ తెలిపారు. ఈనెల 7 నుంచి 10 వరకూ అమ్మవారి ఉత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. బుధవారం ఆలయం ఆవరణలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. టికెట్ల విక్రయాల ద్వారా రూ. 5,88,300 లక్షలు, హుండీల ద్వారా రూ.4,81,336 ఆదాయం లభించినట్టు ఈఓ చెప్పారు. గత ఏడాది రూ.11,32,287 ఆదాయం లభించగా ఈ సారి రూ.62,651 ఆదాయం తగ్గింది. ఈ కార్యక్రమంలో ఈవో కీర్తి శ్రీనివాసరావు, పట్టణ నాయకులు మైలపల్లి షణ్ముఖరావు, వాసుపల్లి కొండబాబు, కదిరి జగన్నాథం, పాసి మధు, ముక్కి కృష్ణ, అప్పికొండ నర్సింగరావు, మైలపల్లి లక్ష్మణరావు, పీరుపల్లి రాజు, కొంకిపూడి ఎర్రిబాబు పాల్గొన్నారు.

‘కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం’

ఎండాడ, ఏప్రిల్ 10 : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని దసపల్లా లేఅవుట్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రచారం, బూత్ లెవెల్ మేనేజ్‌మెంట్, ప్రచారానికి అవసరమైన మెటీరియల్స్, తదితర అంశాలపై నాయకులు చర్చించారు. కూటమి అభ్యర్థుల విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించారు. సమావేశంలో జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్, టీడీపీ అధ్యక్షుడు చెట్టిపల్లి గోపి, బీజేపీ నాయకుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

వెంకోజిపాలెం, ఏప్రిల్ 10 : జీవీఎంసీ 15 వార్డు పాతవెంకోజిపాలెంలోని రామాలయం శ్రీరామ నవమి ఉత్సవాలకు సిద్ధమవుతుంది. శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈఉత్సవాలకు ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భద్రాదిలో జరిగేలా గత ఆరు దశాబ్దాలుగా ఇక్కడ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తారు. ఆఖరి రోజైన శ్రీరామనవమి రోజున తెల్లవారుజాము నుంచి భక్తులకు దర్శనాలు కల్పించి, సీతారామ కల్యాణం చేస్తారు. ఆ రోజు మధ్యాహ్నం మహాఅన్నదానం, సాయంత్రం సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుంది.

చట్టాలను అతిక్రమించొద్దు : సీఐ



యువతకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ గోవిందరావు

ఆరిలోవ, ఏప్రిల్ 10 : ఎన్నికల నేపథ్యంలో యువత చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆరిలోవ సీఐ గోవిందరావు హెచ్చరించారు. బుధవారం ఆయన ఆరిలోవ ఆఖరి బస్టాపు వద్ద యువతకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువు, క్రీడలపై దృష్టిసారించాలని చెప్పారు. ఎన్నిక సమయంలో చట్టానికి విరుద్ధంగా ప్రవరిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముస్లింలకు రంజాన్ తోఫా అందజేత



నిత్యావసర సరకులు అందిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

భీమునిపట్నం, ఏప్రిల్ 10 : పట్టణంలోని జామియా మసీదు ఆవరణలో రంజాన్ పురస్కరించుకుని 20 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కలిగొట్ల వెంకట భానోజీరావు, సభ్యులు, ముస్లిం మత పెద్దలు షేక్ అన్వర్, షేక్ సుభాని, తాజుద్దీన్, అబ్దుల్ వారిష్, భాషా పాల్గొన్నారు.

మిల్లెట్స్‌తో మక్కా మసీదు చిత్రం



వెంకోజీపాలెం, ఏప్రిల్ 10 : మనం తీసుకునే ఆహారంలో మిల్లెట్స్‌ను భాగం చేసుకోవాలని నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మోకా విజయకుమార్ కోరారు. గత ఏడాదిగా ఆయన మిల్లెట్స్ ఉపయోగించి విభిన్న సందర్భాలను పురస్కరించుకుని వందలాది చిత్రాలను తీర్చిదిద్దారు. గురువారం రంజాన్ పురస్కరించుకుని మక్కా మసీదు చిత్రాన్ని చిరుధాన్యాలతో ఎంతో చక్కగా తీర్చిదిద్దారు. ఈ చిత్రాన్ని ముస్లిం పెద్దలకు రంజాన్ శుభాకాంక్షలు చెప్పి, అందజేశారు.

విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు



సమావేశమైన ఏయూ అధికారులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 10 : ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ లెర్నింగ్ (దూరవిద్యా కేంద్రం) నుంచి ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు అందించే బోధన, అభ్యసన విధానాలు, పరీక్షల నిర్వహణ, అకాడమిక్ క్యాలెండర్ తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. రెగ్యులర్ బోధనకు సమానంగా దూరవిద్యలో బోధనా విధానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రం సంచాలకుడు ఆచార్య కె. విశ్వేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్‌స్టీఫెన్, ఓఎస్‌డీ ఆచార్య వి. కృష్ణమోహన్, ఆచార్య చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టోఫెల్ ప్రైమరీ పరీక్షకు 744 మంది హాజరు



పరీక్షలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి నాగేశ్వరరావు

భీమునిపట్నం, ఏప్రిల్ 10 : పట్టణంలోని పలు పాఠశాలల్లో టీచింగ్ ఆఫ్ ఇంగ్లీష్ ఏస్ ఫారిన్ లాంగ్వేజ్ (టోఫెల్) ప్రైమరీ టెస్ట్ బుధవారం నిర్వహించారు. మండలంలో ఎంపిక చేసిన 38 ప్రభుత్వ, మునిసిపల్, ఎంపీపీ పాఠశాలల్లో మొత్తం 744 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఓఎంఆర్ షీట్ ద్వారా ఈ పరీక్ష జరిగింది. ఆడియో ఫైల్స్‌ను పాఠశాలల్లోని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా, స్మార్ట్ టీవీల ద్వారా విద్యార్థులకు వినిపించారు. పరీక్ష నిర్వహణను జిల్లా టోఫెల్ నోడల్ అధికారి, డైట్ సీనియర్ లెక్చరర్ జీజీఎస్ నాగేశ్వరరావు, భీమిలి ఎంఈవో శివరాణి స్థానిక ఏపీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి మాట్లాడుతూ ఈనెల 12న ఎంపిక చేసిన పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు టోఫెల్ ఇంగ్లీష్ రీడింగ్ పరీక్ష జరగనుందన్నారు. ఈ పరీక్షకు మండలంలో 4962 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి యూఎస్‌ఏ ప్రిన్సిటోన్ యూనివర్శిటీ సర్టిఫికెట్ జారీ చేస్తుందని, ఇది అమెరికాలో ఉద్యోగావకాశాల సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

పద్మనాభం, ఏప్రిల్ 10 : పద్మనాభంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యుడు బుధవారం ప్రారంభించారు. టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ప్రచార కార్యక్రమాలను మండల నాయకులకు తెలియజేయడానికి ఈ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

నేడు పద్మనాభంలో గంటా ప్రచారం

భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గురువారం సత్యనారాయణపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు గ్రామంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో పూజలు చేసి అనంతరం ప్రచారానికి శ్రీకారం చుడతారు. అక్కడి నుంచి అయినాడ, బొత్స పేట, బీఆర్ తాళ్లవలస, బుడ్డివలస, గెద్దపేట, కోరాడ గ్రామాల్లో ప్రచారం చేస్తారు.